**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

విజయవాడ,
**తేది : 12 జూలై, 2021.**

**కృష్ణా జలాలపై తెలంగాణా ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరించాలి.**
**వెనుకబడిన ప్రాంతాల నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించి పూర్తి చేయాలి.**
**పోలవరం నిర్వాసితులకు కేంద్రం నుండి నిధులు రాబట్టాలి.**
**సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ సూచన**

కృష్ణా జలాలపై ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల మధ్య వివాదం రోజురోజుకీ ముదరడం పట్ల సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ వివాదం ముదరడం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలకు నష్టం. రెండు రాష్ట్రాల మధ్య విద్వేషాల మూలంగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యమవుతుంది. వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు ప్రాంతాలకు అన్యాయం జరుగుతుంది. వెంటనే మన రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని తెలంగాణా ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరించి సకాలంలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం కోరుతోంది. గురు, శుక్రవారాల్లో విజయవాడలో వి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులుగారు పాల్గొన్నారు. ఒప్పందాలకు కట్టుబడి సామరస్య పూర్వకంగా ఇరు రాష్ట్రాలు చర్చల ద్వారా కృష్ణా జలాల వివాదాన్ని పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని బిజేపీ చేస్తున్న కుయత్నాలను అందరూ ఖండించాలి. ప్రాజెక్టులకు సకాలంలో అనుమతులు, నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసించింది. ఇతర పార్టీలు, సంఘాలు రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, వివక్షతాపూరిత వైఖరిపై గళమెత్తాలని కోరుతోంది. అదే సమయంలో అన్ని పార్టీలు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టకుండా సంయమనం పాటించి వివాదాస్పద సమస్యల పరిష్కారానికి దోహదపడాలని విజ్ఞప్తి చేసింది. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించడంతో సరిపెట్టుకోకుండా పరిష్కారానికి తెలంగాణా ప్రభుత్వంతో చర్చలకు చొరవ తీసుకోవాలని కోరుతున్నది.

కృష్ణా జలాల వినియోగం రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చాలా కీలకం. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు అనుబంధంగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. కాని రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో వెలిగొండ, ఝంజావతి వంటి అనేక ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయి. పోలవరం, వంశధారతో సహా అనేక ప్రాజెక్టుల కింద భూమలు కోల్పోయిన నిర్వాసితులకు, రైతులకు ఇంతవరకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదు. కేంద్రం బాధ్యత నుండి తప్పుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీసి పరిహారం సాధించుకోవడంలో విఫలమవుతున్నది. కాబట్టి కేంద్రం నుండి రావాల్సిన నిధులను రాబట్టి వెనుకబడిన ప్రాంతాల్లోని అన్ని నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఏకాభిప్రాయం సాధించడానికి తక్షణం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండు చేస్తోంది.

**(పేనుమల్లి/మధు)**
రాష్ట్ర కార్యదర్శి